క్లుప్తంగా

నియామకం

స్టేషన్‌ఘన్‌పూర్: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఘన్‌పూర్ నియోజకవర్గానికి ఏడుగురిని బీఆర్‌ఎస్ ఎన్నికల ప్రచార కోఆర్డినేటర్లుగా మాజీ ఎమ్మెల్యే, పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ తాటికొండ రాజయ్య సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. గుండ్రేటి రాజేశ్వర్‌రెడ్డి (ధర్మసాగర్ పీఏసీఎస్ చైర్మన్), చేవెళ్ళి సంపత్ (కొమురవెల్లి దేవస్థాన మాజీ చైర్మన్), ఆకుల కుమార్(కుడా మాజీ డైరెక్టర్), వై.కుమార్‌గౌడ్ (రఘునాథపల్లి మాజీ ఎంపీపీ), పసునూరి మహేందర్‌రెడ్డి(ఆఫీస్ ఇన్‌చార్జ్), తాటికొండ సురేష్‌కుమార్(స్టేషన్‌ఘన్‌పూర్ మాజీ సర్పంచ్), కర్ర సోమిరెడ్డి(నారాయణగిరి మాజీ సర్పంచ్)లను నియోజకవర్గ ఎన్నికల ప్రచార కోఆర్డినేటర్లుగా నియమించారు. నియోజకవర్గ కోఆర్డినేటర్లు వివిధ మండలాల పార్టీ అధ్యక్షులు, ప్రజాప్రతినిధులు, క్లస్టర్ ఇన్‌చార్జీలను సమన్వయపరుస్తూ కార్యక్రమాలను చేపట్టాలని ఆయన సూచించారు.

బ్లాక్ కాంగ్రెస్ మహిళా అధ్యక్షురాలిగా లావణ్యరెడ్డి



రఘునాథపల్లి: మండలంలోని వెల్ది గ్రామానికి చెందిన పెండ్లి లావణ్యరెడ్డి బ్లాక్ కాంగ్రెస్ మహిళా అధ్యక్షురాలిగా నియామకం అయ్యారు. ఈ మేరకు సోమవారం లావణ్యరెడ్డికి టీ పీసీసీ ప్రధాన కార్యదర్శి సింగపురం ఇందిర నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలో లావణ్యరెడ్డి మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రజల్లోకి తీసుకెళ్లి కాంగ్రెస్‌ను మరింత బలోపేతం చేస్తానన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి కడియం కావ్యను భారీ మెజార్టీతో గెలపించేందుకు నాయకులు, కార్యకర్తలు సైనికుల్లా పని చేయాలని పిలుపు నిచ్చారు. తన నియమానికి సహకరించిన జిల్లా, మండల నాయకులకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు.

మహిళా కాంగ్రెస్ జిల్లా కార్యదర్శిగా మౌనిక



స్టేషన్‌ఘన్‌పూర్: కాంగ్రెస్ పార్టీ మహిళా విభాగం జిల్లా కార్యదర్శిగా డివిజన్ కేంద్రానికి చెందిన వడ్లూరి మౌనికకు నియమించినట్లు మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు బడికె ఇందిర ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు మౌనిక ఘన్‌పూర్‌లో సోమవారం విలేకరులతో మాట్లాడారు. జిల్లా కార్యదర్శిగా నియామకం కావడం ఎంతో సంతోషంగా ఉందని, పదవితో తన బాధ్యత మరింతగా పెరిగిందన్నారు. కాగా, పార్టీ మహిళా విభాగం జిల్లా కార్యదర్శిగా నియమించిన పార్టీ జిల్లా అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి, ఘన్‌పూర్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ సింగపురం ఇందిర, మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు బడికె ఇందిర తదితరులకు కృతజ్ఞతలు తెలిపారు.

ఆర్థికసాయం



జఫర్‌గఢ్: మండల కేంద్ర శివారు వడ్డెగూడేనికి చెందిన బొజ్జు రాణి అనారోగ్యంతో మృతి చెందింది. కాగా విషయం తెలుసుకున్న బీజేపీ వరంగల్ పార్లమెంట్ అభ్యర్థి అరూరి రమేశ్ పంపిన రూ. 5వేల ఆర్థికసాయాన్ని పార్టీ మండల అధ్యక్షుడు కోరుకొప్పుల నాగేష్‌గౌడ్ బాధిత కుటుంబానికి సోమవారం అందజేశారు. ఆయన వెంట నాయకురాలు గాదెపాక శ్వేత, బుర్ర తిరుపతిగౌడ్, ఎస్.రమేష్, రాజు, మారపల్లి రవి, లోకేష్‌గౌడ్, పవన్‌యాదవ్ తదితరులు ఉన్నారు.

గ్రామాల అభివృద్ధికి సహకరించాలి



ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న ఎంపీడీఓ

బచ్చన్నపేట: గ్రామాలు అభివృద్ధికి అందరూ భాగస్వాములు కావాలని ఎంపీడీఓ రఘురామకృష్ణ అన్నారు. మండలంలోని నారాయణపురం గ్రామంలోని వన నర్సరీలు, పల్లె ప్రకృతి వనాలను ఆయన సోమవారం పరిశీలించారు. అలాగే ఈజీఎస్ కూలీల పని ప్రదేశాన్ని సందర్శించి వసతులపై అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామస్తులు తమ ఇంటి, నల్లా పన్నులను సకాలంలో చెల్లించాలన్నారు. జాబ్ కార్డు కలిగిన వారందరూ ఈజీఎస్ పనులకు వెళ్లాలని, పనులు కావాలనుకునే పట్టాదారు పాసు పుస్తకం, ఆధార్‌కార్డు, జాబ్ కార్డు జిరాక్స్‌లను పంచాయతీ కార్యదర్శికి అందజేయాలని సూచించారురు. పంచాయతీ కార్యదర్శి దేవీప్రసాద్, కారోబార్ ప్రభాకర్, గ్రామస్తులు పాల్గొన్నారు.

వైభవంగా బీరప్ప కల్యాణం



రఘునాథపల్లి: కొలువుదీరిన బీరప్ప, కామరాతి



బచ్చన్నపేట: బీరప్ప కథ చెబుతున్న పూజారులు



బచ్చన్నపేట: అన్నదానం చేస్తున్న వెంకటేశ్వర్‌రెడ్డి



రఘునాథపల్లి: బీరప్ప, కామరాతి కల్యాణం నిర్వహిస్తున్న కురుమ కులపెద్దలు

రఘునాథపల్లి: మండలంలోని వెల్దిలో కురుమల ఆరాధ్యదైవం బీరప్ప–కామరాతి దేవతల కల్యాణాన్ని సోమవారం అత్యంత వైభవంగా నిర్వహించారు. బీరప్ప పండుగతో గొర్రెలు, మందలు హెచ్చి పంటలు విరివిగా పండి ఆష్టైశ్వర్యాలు సిద్ధిస్తాయని నాలుగు దశాబ్దాల తర్వాత కురుమలు ఐక్యతగా గ్రామ పాఠశాల సమీపంలో నూతనంగా ఆలయాలను నిర్మించారు. వారం రోజుల పాటు బీరప్ప ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. ఆదివారం చెరువు వద్ద గంగాదేవికి ప్రత్యేక పూజలు, లింగాలను చెరువులో నుంచి తేవడం, బీర్నోళ్ల విన్యాసాలు, చాట వేయడం, ఇంటింటి నుంచి బోనాలతో డోలు వాయిద్యాల మధ్య బీరప్ప ఆలయానికి తీసుకెళ్లి సమర్పించారు. రాత్రంతా బీర్నోళ్లు చెప్పిన ఒగ్గు కథలకు భక్తులు ముగ్ధులయ్యారు. సోమవారం ఆలయం ఎదుట తిరుమలగిరి మడలం కోటమర్తి (ఒగ్గు) బీర్నోళ్ల మంత్రోచ్ఛారణాల మధ్య పట్నం వేసి బీరప్ప–కామరాతి కల్యాణం కనులపండువగా నిర్వహించారు. పెద్ద కురుమ, సారి కురుమ దంపతులు బీరప్ప దేవుడి కాళ్లు కడిగి ఆయురారోగ్యాలతో జీవించేలా సల్లంగా సూడయ్యా అంటూ వేడుకున్నారు. భక్తిశ్రద్ధలతో యాటలతో మొక్కులు చెల్లించి బలిచ్చారు. వందలాది మంది భక్తులు వివిధ గ్రామాల నుంచి బీరప్ప–కామరాతి కల్యాణాన్ని తిలకించేందుకు హాజరయ్యారు. ప్రతి ఇంటి నుంచి ఆడపడుచులు, బంధువులు బీరప్పకు మొక్కులు సమర్పించుకున్నారు. మే 2 వరకు నిర్వహించే ఉత్సవాలు శంకుతీర్థంతో ముగుస్తాయని నిర్వాహకులు తెలిపారు.

అతిథుల ప్రత్యేక పూజలు

స్థానిక ఎస్సై దూదిమెట్ల నరేష్, మండల పశువైద్యాధికారి అశోక్‌రెడ్డి, మాజీ సర్పంచ్ కొయ్యడ మల్లేశ్‌లు బీరప్ప కల్యాణోత్సవంలో ముఖ్య అతిథులుగా పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో కురుమ కుల పెద్దలు వడకం ఉప్పలయ్య, మాయ పర్వతాలు, ద్యావర కొమురయ్య, రాగుల అశోక్, పాశం యాదగిరి, మాల్ల మధు, రాగుల ఎల్లయ్య, ద్యావర శ్రీను, వీరస్వామి, మల్లేశ్ పాల్గొన్నారు.

కేసిరెడ్డిపల్లిలో..

బచ్చన్నపేట: మండలంలోని కేసిరెడ్డిపల్లిలో నిర్వహిస్తున్న బీరప్ప పండుగలో భాగంగా సోమవారం బీర్ల పూజార్లు అయ్యాల్లం బీరప్ప–కామరాతిల కల్యాణాన్ని ఘనంగా జరిపించారు. పూజారులు వేషధారణలో బీరప్ప చరిత్రలను ఒగ్గు కథ రూపంలో చెప్పగా భక్తులు తిలకించారు. కుల పెద్దలు, ఒగ్గు, బీర్ల పూజారులు పాల్గొన్నారు.

అన్నదానం

మాజీ ఎంపీపీ జయమ్మ కుమారుడు వెంకటేశ్వర్‌రెడ్డి–సుస్మితలు తండ్రి రమేశ్‌రెడ్డి జ్ఞాపకార్థం బీరప్ప దేవాలయం వద్ద మహా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. అలాగే ఆలయానికి రూ.50వేల విరాళాన్ని అందజేశారు. కార్యక్రమంలో బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీకి సంతోష్ రాజీనామా..

- అంటరాని వారిగా చూస్తున్నారని ఓయూ జేఏసీ లీడర్ ఆవేదన

జనగామ: సీనియర్ నాయకుడు, ఓయూ జేఏసీ లీడర్, జనగామ మండలం వెంకిర్యాలకు చెందిన మద్దెల సంతోష్ బీజేపీకి రాజీనామా చేశారు. కేసీఆర్ నియంత పాలన నుంచి ప్రజలను విముక్తి కలిగించేందుకు ఆ పార్టీలో చేరి క్రియాశీలక పాత్ర పోషించినా.. కొత్త నాయకత్వాన్ని అంటరాని వారిగా చూస్తున్నారని వాపోయాడు. ఈ మేరకు సోమవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ కాంగ్రెస్‌లో రాష్ట్ర కార్యదర్శిగా పనిచేస్తున్న తాను.. బీఆర్‌ఎస్ ఓటమే లక్ష్యంగా బీజేపీలో చేరానని, రాజకీయ లబ్ధి, పదవులు ఆశించకుండా పనిచేస్తే కనీస గుర్తింపు లేదన్నారు. తెలంగాణ ఉద్యమ సమయంలో ఓయూ జాక్ వ్యవస్థాపక సభ్యుడిగా పోరాటం చేస్తూ పోలీసు కేసులతో రోజుల తరబడి జైలు జీవితం గడిపినట్లు పేర్కొన్నాడు. బీజేపీలో తనలాంటి యువకుల సేవలను ఎలా వినియోగించుకోవాలో తెలియక యువశక్తి బలాన్ని నిర్వీర్యం చేసి పార్టీ ఎదగకుండా అడ్డుకుంటున్నారని ఆరోపించారు.

బీజేపీ నాయకుల ఇంటింటి ప్రచారం



ఇంటింటా ప్రచారం చేస్తున్న నాయకులు

జఫర్‌గఢ్: బీజేపీ వరంగల్ పార్లమెంట్ అభ్యర్థి అరూరి రమేశ్‌ను గెలిపించాలని కోరుతూ మండల కేంద్రంలో ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు సోమవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా శక్తి కేంద్రం ఇన్‌చార్జ్ ఎదులాపురం జయశంకర్ మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికల్లో రమేశ్ భారీ మెజార్టీతో విజయం సాధించడం ఖాయమన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా నాయకులు మదన్మోహన్, కాల్వ రవి, శ్రీనివాస్, ప్రేమ్‌కుమార్, చిరంజీవి, సంతోష్, అనిల్, రాజుతో పాటు తదితరులు పాల్గొన్నారు.

మగ్దుంతండాలో..

మండలంలోని మగ్దుంతండాలో బీజేపీ మండల అధ్యక్షుడు కోరుకొప్పుల నాగేష్‌గౌడ్ ఆధ్వర్యంలో ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధి కూలీల వద్దకు వెళ్లి అరూరి కమలం పువ్వు గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని అభ్యర్థించారు. నాయకురాలు గాదెపాక శ్వేత, జిల్లా కార్యవర్గ సభ్యులు బుర్ర తిరుపతిగౌడ్, సింగారపు రమేష్, రాజు, మారపల్లి రవిచ లోకేష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడల్లో గెలుపోటములు సహజం



విజేతలతో నాయకులు, నిర్వాహకులు

కొడకండ్ల: క్రీడల్లో గెలుపోటములు సహజమని, క్రీడాకారులు స్ఫూర్తిగా తీసుకొని ముందుకు సాగాలని కాంగ్రెస్ నాయకుడు వెంగల్‌రావు, బీసీ సంఘం గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు గిరిగాని క్రాంతిగౌడ్ అన్నారు. ఆదివారం రాత్రి మండలకేంద్రంలో నిర్వహించిన ఉమ్మడి వరంగల్, నల్లగొండ జిల్లాల స్థాయి క్రికెట్ పోటీల్లో విజేతలకు బహుమతుల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల్లోని క్రీడాకారులు తమ నైపుణ్యాన్ని చాటుకొనేందుకు ఇలాంటి క్రీడలు ఎంతో దోహపడుతాయన్నారు. విజేతలుగా నిల్చిన రఘునాథపల్లి(ప్రథమ), కొడకండ్ల(ద్వితీయ), పాలకుర్తి(తృతీయ) బహుమతులను వారు అందజేశారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు మహేష్, వంశీ, నాయకులు నాగరాజు, సతీష్‌గౌడ్, కుమార్‌గౌడ్, శ్రీకాంత్, కార్తీక్, రవిందర్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

కావ్య గెలుపునకు పనిచేయాలి



మాట్లాడుతున్న జగదీష్‌చందర్‌రెడ్డి

రఘునాథపల్లి: పాత, కొత్త కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలందరూ ఎంపీ అభ్యర్థి కడియం కావ్య గెలుపు కోసం కలిసికట్టుగా పనిచేయాలని జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు లింగాల జగదీష్‌చందర్‌రెడ్డి కోరారు. సోమవారం మండల కేంద్రంలోని ఏఎస్‌ఆర్ ఫంక్షన్ హాల్‌లో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కోళ్ల రవిగౌడ్ అధ్యక్షతన జరిగిన మండల పార్టీ ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కావ్య గెలుపు కోసం అనుసరించాల్సిన విధానాలపై దిశా నిర్దేశం చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. సమావేశంలో కో ఆర్డినేటర్ వెంకట్‌రెడ్డి, జెడ్పీటీసీ బొల్లం అజయ్, జిల్లా నాయకులు మారుజోడు రాంబాబు, గాదె రమేష్, లింగాజీ, గాదె మహేందర్‌రెడ్డి, గొట్టం భాస్కర్‌రెడ్డి, చీమలపాటి రవీందర్, నామాల బుచ్చయ్య, పోరెడ్డి లక్ష్మీ, బొల్లపల్లి మంజుల, లావణ్యరెడ్డి, పోకల శ్రీనివాస్,ఎండీ గౌస్‌మియా, పులి కార్తీక్ తదితరులుపాల్గొన్నారు.

పార్టీకి బూత్ కమిటీలే కీలకం



మాట్లాడుతున్న కృష్ణారెడ్డి

చిల్పూరు: బీఆర్‌ఎస్ పార్టీకి బూత్ కమిటీలే కీలకమని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి ఎడవెల్లి కృష్ణారెడ్డి అన్నారు. మండలంలోని మల్కాపూర్ గ్రామంలో సోమవారం మండల కార్యదర్శి జనగామ యాదగిరి అధ్యక్షతన బూత్ కమిటీ, ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కృష్ణారెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ఇచ్చిన హామీలు అమలు కాకపోవడం, బీజేపీ అసత్య ప్రచారాలపై ప్రజలకు వివరిస్తూ పార్టీ వరంగల్ ఎంపీ అభ్యర్థి డాక్టర్ సుధీర్‌కుమార్ గెలుపునకు కృషిచేయాలని అన్నారు. వెన్న మాధవరెడ్డి, మంతెన రాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదవశాత్తు వరి దగ్ధం



దగ్ధమైన వరి పైరు

జనగామ రూరల్: గుర్తుతెలియని వారు నిప్పంటించడంతో ప్రమాదవశాత్తు 30 గుంటల వరి పైరు, టేకు చెట్లు దగ్ధమయ్యాయి. మండలంలోని చౌడారం గ్రామంలో సోమవారం ఘటన చోటుచేసుకుంది. చౌడారం గ్రామానికి చెందిన ఎర్ర భాస్కర్ తనకున్న ఎకరంన్నర పొలంలో వరి వేశాడు. గత ఏడాది ఉపాధి హామీపథకంలో భాగంగా టేకు చెట్లు నాటించాడు. చెరువు కట్ట కింద గుర్తు తెలియని వారు నిప్పటించగా తుంగతోపాటు పక్కనే ఉన్న చెట్టు అంటుకొని భాస్కర్ చెందిన వరి పైరుకాలిపోయింది. బాటసారులు అందించిన సమాచారం మేరకు కుటుంబ సభ్యులు అక్కడకు చేరుకొని మంటలు ఆర్పి వరిని కాపాడారు. అప్పు తెచ్చి వరి సాగు చేస్తే ప్రమాదంలో కాలిపోగా రూ.70 వేలు నష్టం వాటిల్లిందని, పంట నష్ట పరిహారం అందించి ఆదుకోవాలని బాధితుడు వేడుకున్నాడు.

ఆధ్యాత్మిక చింతనతో శాంతి సమాజం



ఝాన్సీరెడ్డిని సన్మానిస్తున్న నాయకులు

దేవరుప్పుల: ఆయా సామాజిక వర్గాల ఇలవేల్పుల ఆరాధనలతో ప్రజల్లో ఆధ్యాత్మిక చింతన పెరిగి శాంతి సమాజం తయారవుతుందని కాంగ్రెస్ పార్టీ పాలకుర్తి నియోజకవర్గ ఇన్‌చార్జ్ హనుమాండ్ల ఝాన్సీరెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని సీతారాంపురంలో గంగాదేవి, పడమటితండా(ఎం)లో దుర్గామాత ఉత్సవాల్లో ఆమె పాల్గొని ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నల్ల శ్రీరాములు, కాంగ్రెస్ సీనియర్ నాయకులు ఉప్పల సురేష్‌బాబు, ఓడపల్లి రవీందర్, మాజీ సర్పంచ్ రెడ్డిరాజుల రమేష్, గ్రామ శాఖ అధ్యక్షుడు రతన్‌జీ, సుధాకర్, బీసీ, మైనార్టీ సెల్ మండల అధ్యక్షుడు గణేష్ తదితరులు పాల్గొన్నారు.

‘చామల’ గెలుపు ఖాయం



మాట్లాడుతున్న నాయకులు



సమావేశంలో నాయకులు

జనగామ: భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గంలో కాంగ్రెస్ అభ్యర్థి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి గెలుపు ఖాయమని చౌటుప్పల్ ఎంపీపీ తాండూరు వెంకట్‌రెడ్డి, టీ పీసీసీ సభ్యుడు చెంచారపు శ్రీనివాస్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ నిమ్మతి మహేందర్‌రెడ్డి, దళితరత్న అవార్డు గ్రహీత డాక్టర్ సీహెచ్ రాజమౌళి అన్నారు. డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి ఆదేశాల మేరకు మండలంలోని పెంబర్తిలో సోమవారం జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. చామల గెలుపు కోసం ప్రతి కార్యకర్త కంకణబద్ధులై ప్రచారం చేస్తున్నారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో సంక్షేమ పథకాలు అందుకుంటున్న ప్రతి ఒక్కరూ కిరణ్ కుమా ర్‌రెడ్డిని నిండు మనసుతో ఆశీర్వదించేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ కాగితాపురం మహేందర్‌రెడ్డి, మా జీ ఎంపీపీ ధర్మ గోవర్ధన్‌రెడ్డి, నాయకులు అంబాల ఆంజనేయులు, సిద్దులు, సంకటి యాదగిరి, భాను, సత్తయ్య, సంపత్, హనుమంతరావు, మహేందర్, స్వామి, మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలపై ప్రజలకు తెలియజేయాలి

తరిగొప్పుల: కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం చేపట్టిన అనతికాలంలోనే పలు సంక్షేమ పథకాలను అమలు చేసిందని, ప్రతీ కార్యకర్త గడపగడపకు వెళ్లి సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించి ఎంపీ అభ్యర్థి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి గెలుపునకు కృషిచేయాలని జనగామ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కైతపురం మహేందర్‌రెడ్డి అన్నారు. జిల్లా అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి ఆదేశాల మేరకు మండల అధ్యక్షుడు వగలబోయిన యాదగిరి అధ్యక్షతన సోమవారం మండలకేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించగా ఆయన పాల్గొని మాట్లాడారు. గంగం నర్సింహారెడ్డి, గ్రామశాఖ అధ్యక్షుడు పండుగ కనుకయ్య, వెల్గ రాజశేఖర్‌రెడ్డి, తాడూరు వెంకట్‌రెడ్డి ,ఎర్రవెల్లి పోషయ్య, దామెర జోసఫ్, ఎడ్ల నవీన్, కొయ్యడ రాజు ,అంకం సత్తయ్య, పోషిరెడ్డి, లుకా, ఇంద్రారెడ్డి, బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

సదస్సుపై దాడి అప్రజాస్వామిక దుశ్చర్య

దేవరుప్పుల: వరంగల్ కాకతీయ యూనివర్సిటీ సెనెట్ హాల్‌లో నిర్వహించిన లౌకిక విలువలు–సాహిత్యం సదస్సుపై ఏబీవీపీ నాయకులు దాడి చేయడం అప్రజాస్వామిక దుశ్చర్యని సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు గడ్డం సదానందం సోమవారం ఒక ప్రకటనలో ఖండించారు.

కేయూసీలో ప్రజాస్వామ్యయుతంగా డాక్టర్ పసునూరి రవీందర్, నరేష్ కుమార్ సూఫీ, మెర్సి మార్గరెట్ తదితర రచయితలు, మేధావులు తలపెట్టిన రాష్ట్ర స్థాయి సదస్సును భగ్నం చేస్తున్న క్రమంలో పోలీసులు ప్రేక్షకపాత్ర పోషించటం తీవ్ర విచారకరమన్నారు. ఇలాంటి సంఘటనలు పునరావృతమైతే భవిష్యత్‌లో లౌకిక ప్రజాస్వామ్య హక్కుల కోసం పోరాడుతున్న శక్తులకు రక్షణ లేకుండా పోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి దుశ్చర్యలపై రాష్ట్ర ప్రభుత్వం కఠిన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



ఉపాధ్యాయులతో పూర్వవిద్యార్థులు

స్టేషన్‌ఘన్‌పూర్: మండలంలోని ఛాగల్లు జెడ్పీఎస్ఎస్ 1997–98 పదో తరగతి బ్యాచ్ విద్యార్థులు పాఠశాల ఆవరణలో పూర్వవిద్యార్థుల సమ్మేళనాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్ననాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. చిన్నతనంలో విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. ఉపాధ్యాయులు కోదండపాణి, వైకుంఠం, ఉపేందర్, వెంకట్‌రెడ్డి, హేమలత, పూర్వ విద్యార్థులు ఇ.లక్ష్మణ్, పొన్నం రంజిత్‌గౌడ్, సీహెచ్.సతీష్, మునిరాజ్, అంజయ్య, రజిత, శోభారాణి, మమత, విజయలక్ష్మీ, భువనేశ్వరి, రేణుక, స్వాతి పాల్గొన్నారు.

అంగన్‌వాడీ సేవలు వినియోగించుకోవాలి



కొడకండ్ల: చిన్నారులతో డీడబ్ల్యూఓ జయంతి, అంగన్‌వాడీ టీచర్లు



బచ్చన్నపేట: చిన్నారులతో సూపర్‌వైజర్ కవిత

కొడకండ్ల : పిల్లల అభ్యున్నతి, గర్భిణులు, బాలింతల సంక్షేమం కోసం ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్న సేవలను వినియోగించుకోవాలని డీడబ్ల్యూఓ జయంతి కోరారు. సోమవారం మండలకేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రాలు సంయుక్తంగా నిర్వహించిన ప్రీ స్కూల్ వార్షిక సమావేశంలో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ప్రీస్కూల్ పూర్తి చేసుకొన్న పిల్లలందరిని ప్రభుత్వ పాఠశాలల్లో తల్లిదండ్రులు చేర్పించాలని కోరారు.ఈ కార్యక్రమంలో సూపర్‌వైజరు సరళ, ఏఎన్ఎం జ్యోతి, అంగన్‌వాడీ టీచర్లు మైమూదా, ఉప్పలక్ష్మి, మంజుల, మాధవి, వినోద, నర్సమ్మ, ఆశ కార్యకర్తలు, ఆయాలతోపాటు తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారం అందించాలి

బచ్చన్నపేట: గర్భిణులు, బాలింతలు, కిశోర బాలలకు పౌష్టికాహారం అందించాలని ఐసీడీఎస్ సూపర్ వైజర్ కవిత అన్నారు. మండలంలోని కొన్నె గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో స్కూల్ డేను సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. పిల్లలను అంగన్ వాడీలో చేర్పించాలని, అంగన్‌వాడీలో అందించే పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. అనంతరం పిల్లలకు ప్రోగ్రెస్ కార్డులను అందించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు ఉష, విజయ, పద్మ ఆయాలు, గర్భిణులు, బాలింతలు, చిన్నారులు పాల్గొన్నారు.

మొక్కలను రక్షించాలి



బచ్చన్నపేట: మొక్కలను రక్షించి పర్యావరణాన్ని కాపాడాలని కొడవటూర్ గ్రామ ప్రత్యేక అధికారి ఖాసీమ్ కోరారు. సోమవారం గ్రామంలో వన నర్సరీ, పల్లె ప్రకృతి వనం, రోడ్లకు ఇరువైపులా నాటిన మొక్కలు, సామూహిక జీవాల షెడ్లు, పలు అభివృద్ధి పనులను ఆయన పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ ఎండల దృష్ట్యా మొక్కలు వాడిపోకుండా జీపీ ట్రాక్టర్ల ద్వారా నీరు పోయాలన్నారు. గ్రామస్తులకు తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రూపాచైతన్య, ఫీల్డ్ అసిస్టెంట్ మిన్నాలపురం అశోక్, జీపీ సిబ్బంది పాల్గొన్నారు.